# బొమ్మ లాంతరు

డాక్టర్ కైలాసంగారు పరమ నాస్తికులు. అతనికి దేముడు - దయ్యం, పుణ్యం - మోక్షం, స్వర్గం-నరకం మీద నమ్మకం లేదు. పూజలు, నోములు, వ్రతాలు ఏవీ నప్పవు. బాబాలు, సాధువులు, స్వామీజీలు అంటే ఎలర్జీ! 'వారంతా లేజీ ఫెలోస్, సంఘానికి చీడ పురుగులు!' అని ఆయన భావన.

డాక్టర్ కైలాసంగారు తన భావాల్ని, ఉద్దేశాల్ని ఇతరులపై రుద్దడానికెప్పుడూ ప్రయత్నించరు.

కైలాసంగారి సతీమణి సావిత్రి మాత్రం గొప్ప భక్తురాలు. ఆమె ప్రతి నిత్యం లక్ష్మీ సహస్రం, లలితా సహస్ర నామాలతో పూజలు చేస్తేనే కాని గొంతుకలో మంచినీరు కూడా పోయదు. సావిత్రి తన పూజలు, నోములు, వ్రతాలతో భర్తను ఎన్నడూ కించపర్చలేదు.

డాక్టర్ కైలాసంగారు ఫారిన్ రిటర్న్డ్. పెద్ద నర్సింగ్ హోమ్ అన్ని హంగులతో కట్టించేరు. ఆయన తన నర్సింగ్ హోమ్‌ని చాలా శ్రద్ధగా చూసుకుంటారు. ముఖ్యంగా నర్సింగ్ హోమ్ స్టాఫ్‌నీ, ఇన్‌స్ట్రుమెంట్సుని ఎన్నడూ కాళీగా వుండనివ్వరు. అదీ ఆయనలో గల ప్రత్యేకత.

డాక్టర్ కైలాసంగారు కాస్ట్లీ డాక్టర్. అతని పేషెంట్లంతా ధనిక వర్గానికి చెందినవారే! మిడిల్ క్లాస్, పూర్ పీపుల్స్‌కి ఎల్లప్పుడూ ప్రభుత్వ సహాయం అండ దండలుండనే వుంటాయి. వారికోసం ఎన్నో ధర్మాసుపత్రులున్నాయి. వారికెటువంటి లోటూ వుండదు మరి! అందువల్ల మాన్యులే తప్ప సామాన్యులు డాక్టర్ కైలాసంగారి నర్సింగ్ హోమ్ వైపు కన్నెత్తి చూడరు.

చిన్నపాముకైనా పెద్ద కర్ర ఉపయోగించాలి- చిన్న రోగానికైనా పెద్ద ట్రీట్‌మెంటిచ్చి పేషెంట్ల నెంతో తృప్తి పర్చి తను సంతోషిస్తుంటారు డాక్టర్ కైలాసంగారు. అందువల్లే

గొప్ప పేషెంట్లకు ఆయనపై గొప్ప నమ్మిక.

"మా అన్నయ్య దగ్గర నుండి ఈరోజు ఉత్తరం వచ్చిందండీ! మనందర్నీ ఓ పర్యాయం రమ్మనమని మరీ మరీ రాసేడు. నాలుగేళ్ళయి వాయిదా వేస్తున్నాం! ఓ పర్యాయం వెళ్ళి వస్తే బావుంటుందండీ!" అంది సావిత్రి డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటున్న భర్తతో.

డాక్టర్ కైలాసంగారు మరి ఏ మూడ్‌లో వున్నారో కాని భార్య మాట కాదనక సరే అన్నారు.

భర్త మనసెక్కడ మార్చుకుంటాడో ప్రోగ్రామ్ కేన్సిల్ చేసేస్తాడో నని మర్నాడు వుదయం ట్రైన్‌లోనే బయల్దేరదీసింది సావిత్రి.

ధర్మరాజు గత నాలుగు సంవత్సరాలలో ఎన్నో వుత్తరాలు రాసేడు. చెల్లెలు సావిత్రికి, బావగారైన డాక్టర్ కైలాసంగార్కి, పలుమార్లు తనే స్వయంగా వెళ్ళి వార్ని ఆహ్వానించేడు.

అందుక్కారణం లేకపోలేదు. గత ఐదేళ్ళలో ధర్మరాజు పూర్తిగా మారిపోయేడు. వెల్లువలా వచ్చి పడ్తోంది లక్ష్మి. అతని పాత డాబా స్థానంలో మూడంతస్తుల మేడ లేచింది. రెండు కార్లు, ఒక జీపు కొన్నాడు.

"అంతా ఆ స్వామీజీ దయ! ఆయన ఆశీర్వాద ప్రభావమే!" అంటాడు భక్తి పారవశ్యంతో ధర్మరాజు.

"నిజమే! మరి, స్వామీజీ సాక్షాత్ భగవత్ స్వరూపులు! ధర్మరాజు స్వామీజీ కృపకు పాత్రుడవడం ఎంతో పుణ్య విశేషం!" అంటారు స్వామీజీ భక్త బృందం.

ధర్మరాజుకి స్వామీజీ పరిచయం చాలా చిత్రంగా జరిగింది. ఒకరోజు స్వామీజీ తన శిష్యులతో ధర్మరాజుగారి 'గరువు' మీద మర్రినీడను విశ్రమించేరు. ఆ ప్రదేశం స్వామీజీ నెంతో ఆకర్షించింది. వారికి కొద్ది దూరంలో పశువులు మేపుతున్న మల్లేసుని పిల్చి ఆ 'గరువు', పశువులు ధర్మరాజుగారి వని తెల్సుకొని ఆయనకు వాని ద్వారా కబురు పంపేరు.

ధర్మరాజు కబురందిన వెంటనే స్వామీజి దర్శనం చేసుకొని వారి మహిమలు కళ్ళారా చూసి ఆశ్చర్యపోయేడు.

"ధర్మరాజూ! స్వామీజీకి ఈ ప్రదేశం ఎంతో నచ్చింది. ఇక్కడే వుండాలనుకుంటున్నారు. తగిన ఏర్పాట్లు చేయించు!" అన్నారు శిష్యులు.

"నీకు త్వరలో లక్ష్మి కటాక్షం వుంది!" అన్నారు స్వామీజీ.

ధర్మరాజు ఆనందానికి అవధుల్లేవు.

ఊరికి వుత్తరంగా రోడ్డు పక్కనే పాతిక ఎకరాల మెట్ట వుంది ధర్మరాజుకి. ఆ మెట్టను తరతరాల నుండి సాగుబడి చెయ్యకుండా బంజరుగా వుంచి తమ పశువుల మేతకు ఉపయోగిస్తున్నారు. దాన్నే 'గరువు' అంటూ వ్యవహరిస్తుంటారు.

స్వామీజీ మహిమలు, శక్తి సామర్థ్యాలు కొద్ది రోజుల్లోనే చుట్టుప్రక్కల అనేక గ్రామాల్లో వ్యాపించి భక్తులు తండోపతండాలుగా వచ్చి స్వామీజీని దర్శించి కానుకలు,

ముడుపులు చెల్లిస్తున్నారు.

ధర్మరాజా భక్తుల సహాయంతో స్వామీజీకి చక్కటి ఆశ్రమం కట్టించేడు. వేల సంఖ్యలో భక్తులు కూర్చుని సభలు, సమావేశాలు, ప్రార్థనలూ జరపడానికి విశాలమైన హాలొకటి ఆశ్రమానికి ప్రక్కనే నిర్మింపజేసేడు.

ఆశ్రమానికి దగ్గరలో దుకాణాలకు, హోటళ్ళకు, ఇళ్ళకు కావల్సిన స్థలాలు చ మీటరు వంద రూపాయలు నుండి రెండొందల రూపాయల వరకూ అమ్మేడు ధర్మరాజా. ఆశ్రమ ప్రాంతాన్ని 'స్వామీజీ నగర్' అని పేరు పెట్టేరు భక్తులు. ఆశ్రమ మేనేజ్‌మెంటంతా ధర్మరాజుదే.

ధర్మరాజా పలుకుబడి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వోద్యోగులు, భక్తులతో క్షణం తీరిక చిక్కటం లేదు. నిత్యం భక్తులు వేల సంఖ్యలో వస్తున్నారు. ప్రతి ఏడూ స్వామీజీ జన్మ దినోత్సవాలను ఎంతో ఘనంగా జరుపుతున్నారు.

ఎన్ని వున్నా ధర్మరాజుకి మనశ్శాంతి లేకుండా ఉంది. కారణం తన ఏలుబడి, పలుకుబడి ఫారిన్ రిటర్న్డు బావగారైన డాక్టర్ కైలాసంగారు, సోదరి సావిత్రి చూడలేదనే బాధవల్ల. అకస్మాత్‌గా ఆరోజు బావగారు సావిత్రి రావడంతో ఎంతో సంతోషించేడు ధర్మరాజా.

స్వామీజీ మహిమలు, వారి మానవాతీత శక్తి సామర్థ్యాలు అన్నీ గొప్పగా వర్ణించి చెప్పేడు. స్వామీజీ ఫోటోలు, తావీదులు, స్తోత్రావళి పుస్తకాలు ఇచ్చేడు చెల్లెలు సావిత్రికి ధర్మరాజా.

మర్నాడుదయం డాక్టర్ కైలాసంగార్ని, చెల్లెల్ని తీసుకొని స్వామీజీ దర్శనానికి బయల్దేరేడు ధర్మరాజా. తన భర్త ఏ అడ్డు చెప్పకుండా స్వామీజీ దర్శనానికి బయల్దేరడం చూసి ఎతో ఆశ్చర్యపోయింది సావిత్రి. అంతా స్వామీజీ మహిమేనని నమ్మింది.

ఆశ్రమం ముందు వేయిమందికి పైగా భక్తులు స్వామీజీ దర్శనార్థం కానుకలు పట్టుకొని క్యూలో నిల్చున్నారు.

"ఆ క్యూ అంతా ధర్మ దర్శనం కోసం" అన్నాడు ధర్మరాజా.

స్వామీజీకి తన చెల్లెల్ని, బావగార్ని పరిచయం చేసేడు ధర్మరాజా. స్వామీజీ చిరునవ్వు నవ్వి వార్ని ఆశీర్వదించేరు.

స్వామీజీ చెంతనే వున్న శిష్యులు ఆయన అరచేతుల్లో బాదంకాయంత కర్పూరం ముక్కలుంచి వెలిగించేరు.

స్పెషల్ దర్శనానికొచ్చిన భక్తులు స్వామీజీకి జేజేలు కొడ్తూ సాష్టాంగ పడి కానుకలు, ముడుపులు సమర్పిస్తున్నారు.

ధర్మరాజా, సావిత్రి హారతి కళ్ల కద్దుకొని సాష్టాంగ పడి స్వామీజికి పాదాభివందనం చేసేరు.

డాక్టర్ కైలాసంగారు చలించలేదు. నిశ్చలంగా నిల్చుని స్వామీజీనే చూస్తున్నారు.

"స్వామీజీకి అగ్నిహోత్రుడు ఆప్తమిత్రుడు!" అన్నాడు ధర్మరాజా స్వామీజీ

మహిమను కొనియాడుతూ.

స్వామీజీ వీభూదిని భక్తులకు పంచి యిస్తున్నారు. 'సంజీవి" అంటూ - భక్తులు దాన్ని స్వీకరిస్తున్నారు. డాక్టర్ కైలాసంగార్కి కూడ వీభూది అందివ్వబోయేరు స్వామీజీ.

"ఎన్నాళ్ళ నుండి నీకీ జబ్బు!?" అన్నారు డాక్టర్ కైలాసంగారు స్వామీజీని వుద్దేశించి.

"బావగారూ?!" అన్నాడు ధర్మరాజు కంగారుపడుతూ.

"మూర్ఖుడా! ఏం మాట్లాడుతున్నావో ఎవరితో మాట్లాడుతున్నావో తెల్సా?" స్వామీజీ శిష్యులు కోపంతో కంపించిపోయేరు.

"నేను కాదు మూర్ఖుడ్ని, మీరే! వీడు స్వామీజీ కాడు, వీడిలో మహిమలు, మహత్యాలు, ఏ వల్లకాడూ లేదు. పచ్చి మోసగాడు. పైగా లెప్రసీ పేషెంట్! కుష్టువ్యాధి బాధితుడికి ఎటువంటి స్పర్శజ్ఞానం వుండదు. మీకింకా అనుమానం తీరకపోతే వాడి కాషాయబురఖా తీసి చూడండి! వారి బండారం బయటపడ్తుంది!" అంటూ బయటకు వస్తూ ఎదురుగా నిల్చున్న ఇన్స్పెక్టర్ని చూసి 'ప్లీజ్ ఎరెస్ట్ దెమ్!" అన్నారు డాక్టర్ కైలాసంగారు.

'స్వాతి' సాహిత్య మాస పత్రిక, మే *1980*